క్లుప్తంగా

తండ్రి మందలించాడని..
డబ్బుతో ఇంటి నుంచి వెళ్లిపోయిన పిల్లలు

జవహర్‌నగర్: తండ్రి మందలించాడనే కోపంతో బీరువా పగులగొట్టి డబ్బులు తీసుకుని ఇద్దరు కుమారులు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్‌లోని మణి ఎంక్లేవ్ ప్రాంతంలో సుర్జీవ్ కుమార్ మజీహి కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నారు. సుర్జీవ్‌కుమార్ చిన్న కుమారుడు బ్రిజేశ్‌కుమార్ మజీహి(15) బొల్లారంలోని కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్నాడు. కొంత కాలంగా కుమారుడి వ్యవహారశైలీలో మార్పు రవడంతో తండ్రి మందలించాడు. దీంతో బ్రిజేశ్‌కుమార్ తన బాబాయి కుమారుడైన ప్రిన్స్ మాజీహి (14) (యాప్రాల్ ప్రగతి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు) వెంట పెట్టుకుని ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.17,500లను తీసుకుని సోమవారం ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లారు. వారి ఆచూకీ కోసం కుటుంబీకులు గాలించినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం రాత్రి జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

జవహర్‌నగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మిగడ్డలో నివాసముండే బండి స్వామి(76) కొంత కాలంగా మతిస్థిమితం బాగాలేదు. గతంలో రెండు, మూడు సార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లగా సమీప ప్రాంతాలు గాలించి తీసుకొచ్చారు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్వామి తిరిగి రాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫిట్స్‌తో వివాహిత మృతి

ఘట్‌కేసర్: ఫిట్స్ కారణంగా ఓ వివాహిత మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ చెందిన అతియాబేగం, షేక్ ఖాజాతో 2021 వివాహం జరిగింది. ఆమె గర్భవతి కావడంతో తల్లిగారింటికి రాగ 2022, అక్టోబర్ 21న పట్టణంలోని కల్కి ఆస్పత్రిలో ఓ బాబుకు జన్మనిచ్చింది. అనంతరం డిసెంబర్ 6, 2022న ఆమెకు ఫిట్స్ రావడంతో ఉప్పల్‌లోని ఏబీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. కాగ మంగళవారం ఉదయం నిద్రలో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే ఆమెను పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మరణించినట్లు ప్రకటించారు. ఈ మేరకు మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటోమొబైల్స్ చోరీ నిందితుల రిమాండ్
ఆరు వాహనాలు స్వాధీనం

ఘట్‌కేసర్: ఆటోమొబైల్స్ చోరీ నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యంనంపేట్ చౌరస్తాలో ఉదయం తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న అంబర్‌పేట్ దుర్గానగర్‌కు చెందిన బుర్రోలు రోహిత్ (28), బైరపాక శ్రీనివాస్ (26) అదుపులోకి తీసుకున్నారు. సంఘటన స్థలంలో వారి వద్ద ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఘట్‌కేసర్ పీఎస్‌లో నాలుగు, మేడిపల్లి, మలక్‌పేట్ పీఎస్‌లో ఒక్కొక్క కేసు నమోదైంది. తక్కువ సమయంలో చోరీ కేసు చేధించిన పోలీసులను రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్, అడిషనల్ సీపీ సుధీర్‌బాబు అభినందించారు.

మంత్రిని కలిసిన మేడ్చల్ అసమ్మతి కౌన్సిలర్లు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో అసమ్మతి బావుట ఎగురవేసిన కౌన్సిలర్లు మంగళవారం మంత్రి మల్లారెడ్డిని కలిశారు. చైర్‌పర్సన్‌తో తాను మాట్లాడనని త్వరలో సమస్య పరిష్కరిస్తానని మంత్రి కౌన్సిలర్లకు హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మరోసారి చైర్‌పర్సన్‌పై అసమ్మతి సెగ..

చైర్‌పర్సన్ తీరుపై అలిగి స్వపక్షంలో విపక్షంగా మారిన కౌన్సిలర్లు ఈసారి తమ అసమ్మతిని బహిరంగంగానే వెలిబుచ్చారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలుపుతూ పట్టణంలో భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. కౌటట్లలో ఎక్కడా చైర్‌పర్సన్ ఫొటోగాని ఆమె భర్త ఫొటో గాని, చైర్‌పర్సన్‌కు మద్దతుగా ఉన్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి ఫొటోలు పెట్టలేదు. దీంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

దిల్ హై ఇండియా..

దేశసేవలో తల్లిదండ్రులు.. క్రీడల్లో పిల్లలు

దేశసేవల్లో తల్లిదండ్రులు ముందుంటే... చదువుల్లో, క్రీడల్లో మేము ముందుంటామని నిరూపిస్తున్నారు జవహర్‌నగర్ సీఆర్‌పీఎఫ్ పాఠశాల విద్యార్థులు. కుటుంబమంతా భారతదేశాన్ని ఉన్నత స్థానంలో ఉంచేందుకు పాటుపడుతున్నారు. దేశం గర్వించేలా పని చేస్తున్న ఈ కుటుంబాలను అభినందించకుండా మనం ఉండలేం. దేశ సేవే పరమావధిగా పని చేస్తున్న జవానుల పిల్లలు జాతీయస్థాయి క్రీడల్లో పతకాల పంట పండిస్తున్నారు. ఈనెల 6న సీఆర్‌పీఎఫ్ పాఠశాల 26వ క్రీడా వార్షికోత్సవం సందర్భంగా పిల్లల గురించి ప్రత్యేక కథనం.





జవహర్‌నగర్: కలలు కనడం మానవ హక్కు.. అది అభివృద్ధికి తొలిమెట్టు అన్నారు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం. అలాగని కలలుకంటూ కూర్చుంటే జీవితంలో ముందడుగు వేయలేం. వాటిని సాకారం చేసుకునే దిశగా అడుగు వేసే దిశగా ప్రతిక్షణం పట్టుదలతో శ్రమించాలి. అలాంటి ప్రయత్నమే చేస్తున్నారు జవహర్‌నగర్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్ విద్యార్థులు. ఆటల్లో పతకాల పంట పండించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తరగతి గదుల్లో కుస్తీ పడుతూనే విరామ సమయంలో వ్యాయామ ఉపాధ్యాయుడి సహకారంతో క్రీడల్లో ప్రతిభ చూపిస్తున్నారు. సీఆర్‌పీఎఫ్ పాఠశాల విద్యార్థులు ఆటల్లో ఆణిముత్యాలని అనిపించుకుంటున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్) ఎనలేనిది. మరోవైపు జవహర్‌నగర్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపస్‌లో సీఆర్‌పీఎఫ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 1997లో స్థాపించి కొనసాగుతున్న సీఆర్‌పీఎఫ్ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో సత్తా చూపి పతాకాలు సాధిస్తున్నారు. 2024 ఒలింపిక్సే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.



జాతీయస్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులతో సీఆర్‌పీఎఫ్ ఉపాధ్యాయులు

సీఆర్‌పీఎఫ్ విద్యార్థులు సాధించిన పతకాల్లో కొన్ని..

- 2017 జులైలో హైదరబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 5గురు విద్యార్థులు పాల్గొని బహుతులు సాధించారు.
- అక్టోబర్ 2 నుండి 4వరకు కేరళ రాష్ట్రంలో జరిగిన సీబీఎస్‌ఈ సౌత్‌జోన్ తైక్వాండో పోటీలలో 26 మంది విద్యార్థులు పాల్గొని 12 బహుమతులు సాధించారు.
- అక్టోబర్ 29న సూర్యాపేటలో జరిగిన జూనియర్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో 8మంది పాల్గొని 3 ప్రథమ, 2 ద్వితీయ, 1 తృతీయ బహుతమతులు సాధించారు.
- నవంబర్ 24 నుంచి 26 వరకు విశాఖపట్టణంలో జరిగిన జాతీయస్థాయి అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ పోటీలలో నలుగురు విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ సాధించారు.
- 2022లో 400మంది విద్యార్థులు పలు క్రీడా పోటీలలో పాల్గొని 350 మంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిలో 250 మంది జాతీయస్థాయిలో పాల్గొని 25మంది ఎంపికయ్యారు. ఐదుగురు సీబీఎస్‌ఈ క్లస్టర్ నేషనల్ టర్‌మస్‌కు ఎంపికయ్యారు.
- నెల్లూరులో జరిగిన బాస్కెట్‌బాల్ సీబీఎస్‌ఈ పోటీలలో తృతీయ స్థానాన్ని సాధించారు.
- సీబీఎస్‌ఈ అథ్లెటిక్స్‌లో 5 గోల్డ్, 7 సిల్వర్, 2 బ్రాంజ్ మోడల్స్ సాధించి 12 మంది జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.



నాన్న ఆశయం నెరవేరుస్తా...



మాది మేడ్చల్ జిల్లాలోని అత్వెల్లి గ్రామం. మా నాన్న పోస్ట్ ఆఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. క్రీడలంటే మక్కువతో అథ్లెటిక్స్‌ను ఎంపిక చేసుకుని 100, 200 మీటర్లు, లాంగ్‌జంప్‌లో సాధన చేస్తున్నాను. ఉదయం సాయంత్రం వేళల్లో ప్రతిరోజు 3గంటలు మా శిక్షకులు సాధన చేయిస్తున్నారు. క్రీడల పరంగా ఒలింపిక్స్‌లో పాల్గొని విజయం సాధించాలని కోరిక. విజయం సాధించి మా నాన్న ఆశయాన్ని నెరవేరుస్తా.

మండల స్నేహ, 11వ తరగతి

నాలుగు గంటలు ప్రాక్టీస్ చేస్తాను



మాది నిజామాబాద్. నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. అందుకే రెండు సంవత్సరాల నుంచి అథ్లెటిక్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్నా. ఇప్పటి వరకు జిల్లా, రాష్ట్రస్థాయిలలో జావెలిన్ త్రోలలో గోల్డ్ మెడల్ సాధించాను. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటాననే నమ్మకం ఏర్పడింది.

అభిరామ్, 11వ తరగతి


ఒలింపిక్స్‌కు వెళ్లేలా తయారు చేస్తాం..



విద్యార్థులను ఒలింపిక్స్‌కు అర్హత సాధించే విధంగా తయారు చేయడమే నా జీవితాశయం. క్రీడలపై ప్రిన్సిపల్ అపర్ణ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నందుకు సంతోషంగా ఉంది. విద్యార్థులు పట్టుదలతో జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధిస్తున్నారు. వారు ఏఏ రంగాలలో ఆసక్తి చూపుతున్నారో గుర్తించి ఆటల్లో మెలుకలను నేర్పిస్తున్నాం.

రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్

దేశానికి పేరు తేవాలి..



చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఆటలాడితే సరిగా చదవరని అపనమ్మకం పెట్టుకుంటున్నారు. కానీ తమ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఫలితాలు సాధించేలా ప్రాధాన్యమిస్తున్నాం. సీఆర్‌పీఎఫ్ పాఠశాల ఐజీ పర్యవేక్షణలో కొనసాగుతోంది. క్రీడల్లో శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకంగా కోచ్‌లను నియమించి శిక్షణ ఇస్తున్నాం. దీనికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

అనిల్ మింజ్, డీఐజీపీ సీఆర్‌పీఎఫ్ గ్రూప్ రంగారెడ్డి

కేసీఆర్ నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారు

- ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల గోస పట్టదా?



ఎమ్మెల్యే ఈటలకు వినతి పత్రం ఇస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు

మేడ్చల్: ఉద్యోగాల కోసం వేచి చూస్తున్న ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల గోస ప్రభుత్వానికి ఎందుకు పట్టడం లేదని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పూడూర్‌లోని ఆయన నివాసంలో అయన్ను మంగళవారం ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తూ నిరుద్యోగులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. రన్నింగ్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులందరినీ ఫైనల్ పరీక్షలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఎనిమిదేళ్లు గడుస్తున్నా కొన్ని ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసి చేతులు దలుపుకున్నారని ఆరోపించారు.

కొత్త నిబంధనలతో లక్షమంది అనర్హులు..

నోటిఫికేషన్‌లు ఇచ్చినా కుంటి సాకులు చూపి ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని అన్నారు. జేఏల్ఎం ఉద్యోగాలలో మాస్‌కాపీ జరగడంతో రద్దు చేసినట్లే సింగరేణిలో అదే విధంగా వ్యవహరించాలని ఆరోపించారు. నోటిఫికేషన్లు తాటికాయంత అక్షరాలతో ఇచ్చి నియామాకలు మాత్రం చేయడం లేదని విమర్శించారు. దేశంలో పోలీసు శాఖలో లాంగ్‌జంప్ 3.8 మీటర్లకు పెడితే తెలంగాణలో 4 మీటర్లు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. దీంతో లక్ష మంది అభ్యర్థులు అనర్హులయ్యారని పేర్కొన్నారు. నూతన నిబంధనలు తీసేసి పాత నిబంధనలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సర్కారు బడిలో అదనపు కలెక్టర్ తనిఖీలు

కీసర: చీర్యాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను మంగళవారం అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా విద్యాధికారి విజయకుమారితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులు, విద్యార్థుల హాజరుతీరు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధర్మేందర్, ఉపసర్పంచ్ తిరుమల్‌రెడ్డి, ఏఈ జగపతి బాబు, హెచ్‌ఎం బాలకృష్ణ పాల్గొన్నారు.

'తెలంగాణ ప్రభుత్వం మాటల ప్రభుత్వం'

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రభుత్వం మాటల ప్రభుత్వమని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. ఎదులాబాద్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంగళవారం ఎంపీపీ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠశాల సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నేటి వరకు దుస్తులు, పుస్తకాలు ఇవ్వలేదని, మెను ప్రకారం భోజనం వడ్డించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా పాలు, గుడ్లు సరఫరా చేయడం లేదని, 8 నెలలుగా బిల్లులు రావడం లేదన్నారు. అధికార యంత్రాంగం సరైన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీని అభివృద్ధిలో ముందంజలో ఉంచుతామని చైర్‌పర్సన్ ప్రణీతా గౌడ్ అన్నారు. మంగళవారం 4వ వార్డులో సుమారు రూ.20లక్షలతో చేపట్టనున్న అంతర్గత మురికికాలువ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్వామి, వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకటేష్ పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీలో..

నాగారం మున్సిపాలిటీ పరిధిలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడతామని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ఆర్ఎల్‌నగర్‌లో మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి, కలెక్టర్ హరీష్, అధికారులు మేయర్లు, చైర్మన్లు

కంటి వెలుగును విజయవంతం చేయాలి

మంత్రి చామకూర మల్లారెడ్డి

సాక్షి,మేడ్చల్‌జిల్లా: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్, బీఆర్కే భవన్‌లో ఉన్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీష్‌రెడ్డి, సీఎస్ సోమేష్‌కుమార్, ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌తో ఆయన మాట్లాడారు. జిల్లాలో 27,51,810 మందికి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. జిల్లాలో 79 బృందాలను ఏర్పాటు చేయగా, జీహెచ్‌ఎంసీ పరిధిలో 51 బృందాలు, గ్రామీణ ప్రాంతాల్లో 10 బృందాలు, మున్సిపల్ పరిధిలో 18 బృందాలు ఉంటాయని సమన్వయంతో పని చేయాలని కోరారు.

రోజూ 400మందికి కంటి పరీక్షలు చేయాలి..

ప్రతి నిత్యం గ్రామీణ ప్రాంతాల్లో 300 మందికి, అర్బన్, పట్టణ ప్రాంతాల్లో ప్రతిరోజూ 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. వార్డులు, పంచాయతీల వారీగా ఏ రోజు వైద్య శిబిరం ఎక్కడ నిర్వహించేది... వైద్యబృందాలకు వసతి ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హరీష్, అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్, నగర మేయర్లు జక్క వెంకట్‌రెడ్డి, కావ్య,బుచ్చిరెడ్డి, నీలా, మున్సిపల్ చైర్మన్లు కొండల్‌రెడ్డి, ప్రణీత, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలపాలి

కలెక్టరేట్ కొత్త సంవత్సర వేడుకల్లో మంత్రి మల్లారెడ్డి



కలెక్టరేట్ హరీష్‌కు కేక్ తినిపిస్తున్న మంత్రి మల్లారెడ్డి. చిత్రంలో జిల్లా అధికారులు, ట్రెసా నాయకులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని.. మేడ్చల్ జిల్లాను అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలపాలని సంబంధిత అధికారులకు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన న్యూ ఇయర్ కేక్‌ను కట్ చేసి జిల్లా అధికారులతో సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి, కలెక్టర్ హరీష్‌ను వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది శాలువాతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీవోలు రవి, మల్లయ్య, ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ ,జిల్లా అధ్యక్షుడు సుధాకర్,ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్‌రావు, టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు ,వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల పనితీరు ప్రశంసనీయం



ఆర్డీఓలు, తహశీల్దార్లకు అభినందన పత్రాన్ని అందజేస్తున్న అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని వివిధ మండలాలలో కుల, ఆదాయ, నివాస తదితర ధ్రువీకరణ పత్రాల జారీలో రెవెన్యూ అధికారులు ప్రశంసనీయమైన సేవలు అందించారని జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. అన్నీ మండలాల పరిధిలో తహసీల్దార్లు నిర్ణీత సమయం లోపల సర్టిఫికెట్లు అందిస్తున్నారని పేర్కొన్నారు. నిర్ణీత కాలం దాటిన దరఖాస్తు ఒక్కటి కూడా లేకపోవడాన్ని ఆన్‌లైన్‌లో పరిశీలించిన అదనపు కలెక్టర్(రెవెన్యూ) నర్సింహారెడ్డి మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారులకు అభినందన పత్రాన్ని అందచేశారు. నిర్ణీతకాలం దాటిన దరఖాస్తు ఒక్కటి కూడా పెండింగ్‌లో లేకుండా చూసిన అధికారులు ఇదే సంప్రదాయాన్ని ఎల్లప్పుడూ కొనసాగించాలని ఆయన సూచించారు.

మైనారిటీలకు ప్రభుత్వ పథకాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షాహేజాది

సాక్షి,మేడ్చల్ జిల్లా: కేంద్ర ప్రభుత్వ పథకాలు మైనారిటీలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షాహేజాది కోరారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో పాటు సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లాలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా అంకితభావంతో పని చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మైనారిటీలకు సంబంధించి పథకాలపై సమీక్ష సమావేశాలు నిర్వహించి పురోగతిపై చర్చించాలని సూచించారు. ప్రధానమంత్రి పదిహేను సూత్రాల పథకం అమలు తీరును ఆమె అడిగి తెలుసుకొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి నవీన్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



కీసరలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాటేపల్లి జనార్దన్‌రెడ్డి



పీఆర్‌టీయూ–టీఎస్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



మహిళా టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని మేడ్చల్ నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు సావిత్రిబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని పీఆర్‌టీయూ–టీఎస్ నాయకులు అన్నారు. కీసరలోని సావిత్రిబాయి విగ్రహానికి ఉపాధ్యాయ శాసనమండలి ఫ్లోర్‌లీడర్ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చేసిన సేవలను ఆయన కొనియాడారు.

– మేడ్చల్ బృందం జోన్



ఘట్‌కేసర్‌లో..



జవహర్‌నగర్‌లో..



వికలాంగుల కాలనీలో..

దవాఖానాలు, బడుల్లో తనిఖీలు

ఘట్‌కేసర్: పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి తెలంగాణ ప్రభుత్వం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీ యాదవ్ అన్నారు. పట్టణంలోని బస్తీ దవాఖానాను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. అలాగే పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యం, రికార్డులు, విద్యార్థుల మధ్యాహ్న భోజనం మెనును అడిగి తెలుసుకున్నారు. మరుగు దొడ్లు, కిచెన్ షెడ్డును పరిశీలించారు. నిబంధనల మేరకు విద్యార్థుల భోజనం మెను అమలు చేయాలని సూచించారు. లేని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పాపిరెడ్డి, జంగయ్యయాదవ్, రహీం, మాధవరెడ్డి పాల్గొన్నారు.

కేంద్రం తీరుతో సామాన్యులు బతకలేని పరిస్థితి

జవహర్‌నగర్: బీజేపీ కేంద్ర ప్రభుత్వ తీరుతో సామాన్య ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఎస్సీ రిజర్వేషన్లు 100 రోజుల్లో చేస్తామని చెప్పి 8 సంవత్సరాలు కావస్తున్నా వర్గీకరణ మాటే ఎత్తడం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొయ్యడ వెంకటేష్, మేడ్చల్ జిల్లా కో–కన్వీనర్ శివకుమార్‌మాదిగ, నాయకులు పాల్గొన్నారు.